క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): మండల కేంద్రం అన్నపురెడ్డిపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ కల్యాణ క్రతువు జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఉచిత వైద్యశిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న రేణుకారెడ్డి

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని పులిగుండాల గ్రామంలో డాక్టర్ రేణుకరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గర్భిణులు, బాలింతలను, జ్వరంతో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సిబ్బంది అమ్మాజ్జి, నాగేశ్వరరావు, సావిత్రి, సబ్ సెంటర్ ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం నుంచి మంచిర్యాలకు ఏసీ బస్సు

భద్రాచలంటౌన్: భద్రాచలం నుంచి మంచిర్యాలకు ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక ఏసీ సర్వీసును నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ తిరుపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీస్ ప్రతీరోజు రాత్రి 7 గంటలకు బయలుదేరి మంచిర్యాల చేరుకుని మళ్లీ భద్రాచలానికి సాయంత్రం 6 గంటలకు వస్తుందని తెలిపారు. భద్రాచలం నుంచి కొత్తగూడెం వయా ఇల్లెందు, హన్మకొండ, కరీంనగర్, గోదావరిఖని మీదుగా మంచిర్యాల చేరుతుందని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

కేజీబీవీలో రేపు స్పాట్ అడ్మిషన్లు

ములకలపల్లి: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ)లో రేపు (సోమవారం) స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఎస్ఓ మహేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం సీఈసీలో గ్రూపులో 10 సీట్లు, ఎంపీహెచ్‌డబ్ల్యూలో 20 సీట్లు, ఆరోతరగతిలో 10 సీట్లు ఖాళీగా ఉనాయని, అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థినులు సంబంధిత సర్టిఫికెట్లతో కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆర్థికసాయం

బూర్గంపాడు: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండలంలోని సందెళ్లరామాపురం గ్రామానికి చెందిన డేగల కోటేశ్వరరావు మృతదేహానికి శనివారం పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందించారు. నాయకులు కుర్సం వెంకన్న, భూక్యా మోహన్, వాసం నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

దుమ్ముగూడెం: మండలంలోని గోవిందాపురం గ్రామంలో ఎంఎస్‌కె బంగారు భవిష్యత్ ఆధ్వర్యంలో మైరాడ స్వచ్ఛంద సంస్థ సుస్థిర వ్యవసాయం, అంతర పంటలపై శనివారం రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చు ఎక్కువ దిగుబడి వచ్చేలా పంటలు పండించాలని ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేయాలని ఒకే పంట కాకుండా పంటలను మార్పులు తీసుకురావాలని అలా చేయడంలో రైతు అభివృద్ధి చెందుతారని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మైరాడ ఆగ్రోనామిస్ట్ షణ్ముఖ సాయి, కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎం.రాజు, ఏబీసీ లీడర్ తెల్లం హరికృష్ణ, తెల్లం భీమరాజు రైతులు పాల్గొన్నారు.

గ్రామసభ వాయిదా..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పంచాయతీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన గ్రామసభను ఈవో శ్రీనివాసరావు వాయిదా వేశారు. పట్టణంలో ఏ- 4 మద్యం దుకాణాల నిర్వహణకు సంబంధించి ఏర్పాటు చేసిన పెసాగ్రామ సభలో కోరం సభ్యులు లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఈవో వెల్లడించారు. అంతక ముందు గ్రామ సభకు ఎవరు హాజరుకాకపోవడంతో పాల్గొన్న వివిధ పార్టీలకు చెందిన నాయకులు మాట్లాడుతూ... పట్టణంలో ఒక బెల్టు షాపులను నివారించాలని, ఆర్థికంగా గిరిజనులు ఎలా అభివృద్ధి చెందాలనే విషయంపై చర్చించాల్సిన సభకు అధికారులు కూడా గ్రామసభలో పాల్గొనకపోవడం సమంజసం కాదన్నారు.

ట్రెండ్ మారినా.. ఫ్రెండ్ మారడు..

స్నేహం అవధులు లేనిది.. అంతస్తులు చూడనిది.. వయసు లెక్కచేయనిది.. ఇష్టాలను పంచుకునేది.. కష్టాల్లో తోడుగా నిలిచేది.. ఇలా ఒకటేమిటి.. ఆ బంధాన్ని తెలిపేందుకు భావాలు ఎన్నో. దాని విలువను వివరించడానికి అక్షరాలు కూడా చాలవు.. ఆ అనుబంధాన్ని అక్షరీకరించడానికి భాషలూ సరితూగవు. స్నేహమంటే నవమాసాలు మోయని తల్లి.. రక్తం పంచని తండ్రి.. వాటా అడగని తోబుట్టువు.. చుట్టరికం లేని బంధువు. ఏ నిర్ణయం తీసుకోవాలో తెలియని సమయంలో దిశా నిర్దేశం చేసే మార్గదర్శి స్నేహితుడు. భారమైన హృదయానికి ఓదార్పు.. అశాంతి నిండిన మనసుకు ఆదరింపు.. అలసిన కన్నులలో కమ్మని కల.. ఇలా స్నేహం గురించి ఎన్ని ఉపమానాలు చెప్పినా తక్కువే. నేటి ఆధునిక సాంకేతిక యుగంలో సామాజిక మాధ్యమాల కారణంగా చిన్ననాటి స్నేహితులు కూడా దగ్గరవుతున్నారు. ఆదివారం ఫ్రెండ్ షిప్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

– భద్రాచలంఅర్బన్



- విడదీయరానిది స్నేహబంధం
- అక్షరాలకు అతీతమైన పుస్తకమది

నేడు స్నేహితుల దినోత్సవం


ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కొనుగోలు చేస్తున్న స్థానికులు

స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం అంటూ ఓ సినీ గేయ రచయిత స్నేహానికి ఉన్న అర్థాన్ని పాట రూపంలో తెలిపాడు. ఇదొక్కటే కాదు స్నేహం విలువను తెలియజేస్తూ మరెన్నో పాటలు వచ్చాయి. అవన్నీ మరుపురాని గేయాలుగా మిగిలిపోయాయి. స్నేహం జీవితాంతం నిలిచి ఉంటుంది. ధనం ఒకరోజు వస్తుంది. రేపు పోతుంది. కష్ట సుఖాల్లో పాలు పంచుకునే వాడే నిజమైన స్నేహితుడు. అలాంటి స్నేహితుడు ఒక్కడుంటే చాలు. వారి జీవితం ధన్యమే అవుతుంది. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఫ్యాన్సీ షాపుల వద్ద వివిధ రకాల ఫ్రెండ్ షిప్ బ్యాండ్ల అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. వివిధ రకాల డిజైన్లలో ఇవి ఆకట్టుకుంటున్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు యువతీ యువకులు ఆసక్తి చూపుతున్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొనేందుకు యువత ప్రత్యేక ఏర్పాట్లలో నిమగ్నమైంది.



కష్టసుఖాలు పంచుకునేందుకు..



మన కష్టాసుఖాలు పంచుకునేందుకు కచ్చితంగా ఒక స్నేహితుడు ఉండాలి. ఎందుకంటే స్నేహబంధం చాలా గొప్పది. ప్రస్తుతం ఆన్‌లైన్ స్నేహాలు ఎక్కువవుతున్నాయి. అవి ప్రమాదాలకు దారితీస్తాయి. తెలిసిన వారితో స్నేహం చేయడం ఉత్తమం.

– శ్రీధిరాల వెంకటాచారి, మెడికల్ కాలనీ, భద్రాచలం

నమ్మకం.. నిజాయితీ ఉండాలి



నిజాయితీ, నమ్మకంతో కూడిన స్నేహమే కలకాలం ఉంటుంది. అవసరాలకు వాడుకునే స్నేహం సరికాదు. బంధువులకు కూడా చెప్పుకోలేని చాలా సమస్యలను స్నేహితులతోనే పంచుకో గలం. అనుకోకుండా పరిచయమై జీవితాంతం నేనున్నా అంటూ వచ్చేది ఒక్క స్నేహమే.

– డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, భద్రాచలం

ఆన్‌లైన్ స్నేహాలపై అప్రమత్తం



సోషల్‌మీడియా ప్రభావం సమాజంలో ఎక్కువగా ఉంది. సామాజిక మాధ్యమాల స్నేహం చేసే సందర్భంలో జాగ్రత్తగా ఉండాలి. గుర్తు తెలియని వ్యక్తులతో స్నేహం చేసేటప్పుడు మరింత అప్రమత్తత అవసరం. నమ్మకం కుదిరే వరకూ వ్యక్తిగత సమాచారాన్ని, ఫొటోలను పంచుకోవద్దు.

– విక్రాంత్ కుమార్ సింగ్, ఏఎస్పీ భద్రాచలం

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు


మాట్లాడుతున్న ఆర్డీఓ దామోదర్‌రావు, పక్కన్న ఎమ్మెల్యే వెంకట్రావు తదితరులు

భద్రాచలంటౌన్: గోదావరి వరదల ముంపునకు గురయ్యే మండలాల్లో వరదలు పెరిగినప్పుడు పోలీసులు, అధికారుల అప్రమత్తమై వెంటనే ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని రంగంలోకి దించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. స్థానిక సబ్ కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జాతీయ విపత్తుల స్పందన దళం సారథ్యంలో ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో పోలీస్, రెవెన్యూ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్డీవో దామోదర్‌రావుతో కలిసి శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముంపునకు గురయ్యే మండలాల్లోని గ్రామాల్లో వరదలు ఎక్కువైనప్పుడు సమస్యను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. గోదావరి వరదల సమయంలో తీసుకోవలసిన రక్షణ చర్యలపై ఎన్‌డీఆర్ఎఫ్ బృందం డెమో ద్వారా ప్రజలకు జాగ్రత్తలు తెలపాలన్నారు. అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన ప్రజలకు సీపీఆర్ ద్వారా ప్రాణనష్టం జరగకుండా చూడవచ్చన్నారు. అనంతరం వరదలలో కొట్టుకుపోయిన మనుషులను ఏ విధంగా కాపాడాలో డెమో ద్వారా ప్రాక్టికల్‌గా ఎన్డీఆర్ బృందం సమావేశానికి వచ్చిన అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ ధనియాల వెంకటేశ్వరరావు, ఎన్‌డీఆర్ఎఫ్ టెన్త్ బెటాలియన్ డీఎఫ్ఓలు ఇమజ్, కోటేశ్వరరావు, మంగరాజు, నరేందర్ రెవెన్యూ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


పినపాక: మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

పినపాక: రాష్ట్రంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్కార్డులు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల పరిధిలోని ఈ బయ్యారం క్రాస్ రోడ్డులో జీపీఆర్ ఫంక్షన్హాల్‌లో జరిగిన నూతన రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గానికి అదనంగా 2,500 ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సునీల్ కుమార్, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు, సివిల్ సప్లై డ్యూటీ శివకుమార్, ఎంఈఓ నాగయ్య, మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం, నాయకులు ఆనంద్, పాల్గొన్నారు.

దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు

మణుగూరు టౌన్: ప్రతీ పేదవాడికి ఇల్లు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ చారిత్రత్మక నిర్ణయం తీసుకుందని, అర్హులకు దశలవారీగా ఇళ్లు మంజూరవుతాయని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలో సమితిసింగారంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ నిర్వహించారు. పంచాయతీ పరిధిలో రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ నరేశ్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్, శివ సైదులు, నాయకులు సౌజన్య, యూత్ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, గణేశ్‌రెడ్డి, గాండ్ల సురేశ్, కొమరం రామ్మూర్తి, సాంబశివరావు, తమ్మిశెట్టి సాంబ తదితరులు ఉన్నారు.

ఏటీసీ పోస్టర్లు ఆవిష్కరణ..

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన ఏటీసీ పోస్టర్లను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ప్రతీ ఐటీఐ కళాశాలలో ఏటీసీ కేంద్రం ఏర్పాటు చేసిందని, ఆ కోర్సులకు సంబంధించిన ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రవి, ఏటీవోలు శ్రీనివాసరావు, కృష్ణారావు, నర్సయ్య, శివకుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం


అవగాహన కల్పిస్తున్న ఏడీఈ రామారావు

కరకగూడెం: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లో వోల్టేజ్, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ వంటి సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని మణుగూరు ఏడీఈ రామారావు అన్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని రైతుల పొలాల వద్ద 'పొలంబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ల వినియోగం, విద్యుత్ పొదుపు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మోటార్లను సరిగ్గా ఉపయోగించాలని, తద్వారా విద్యుత్ ఎలా ఆదా చేయవచ్చన్నారు. నాణ్యతలేని మోటార్ల వల్ల విద్యుత్ వృథా అవుతుందని, సరైన ప్రమాణాలతో ఉన్న మోటార్లను ఉపయోగించాలన్నారు. కంచెలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వొద్దని, వైర్లు తెగిపడినప్పుడు లేదా మరమ్మతులు అవసరమైనప్పుడు వెంటనే విద్యుత్ శాఖకు తెలియజేయాలన్నారు. రైతులు తమ సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ నరేందర్ రెడ్డి, సబ్ ఇంజనీర్ రాజశేఖర్, లైన్‌మెన్ రత్నశేఖర్, ఏఎల్ఎం రవీందర్, జేఎల్ఎంలు సాగర్, నర్సింహారావు, ఫీల్డ్ సిబ్బంది ఉపేందర్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మణుగూరురూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంపన సీతారామరాజు శనివారం పార్టీ స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి అమలవుతున్నాయన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేడు, రేపు(సోమవారం) కేంద్ర పథకాలపై పోలింగ్‌బూత్ స్థాయిల్లో కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పట్టా భిక్షపతి, నాయకులు కామసాని వీరమధుసూదన్, కుంజా రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి మురళీమోహన్ రాజు, ఉపాధ్యక్షుడు ఏనిక రామచంద్రయ్య, ఏనిక బాలకృష్ణ పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు


ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది, గ్రామస్తులు

దుమ్ముగూడెం: మండలంలోని అంజుబాక అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను శనివారం ఐసీడీఎస్ ఆర్లగూడెం సెక్టర్ సూపర్‌వైజర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించి, తల్లిపాల ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలకు వివరించారు. అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి, ఏఎన్ఎంలు టి.కరుణ, వీరభద్రమ్మ, పంచాయతీ సెక్రటరీ ఎం.సంధ్య, కె.పద్మ, సురేష్, గోపి, మౌనిక పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి


ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అశ్వాపురం: మండలకేంద్రంలో ప్రధాన రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు తక్షణమే పూర్తి చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు దుకాణాలు బంద్ చేపించి ర్యాలీ చేపట్టి ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... బీఆర్ఎస్ హయాంలో మాజీ ఎమ్మెల్యే రేగా ప్రత్యేక చొరవతో డ్రెయినేజీ, రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులకు నిధులు మంజూరయినా ఇంకా పనులు పూర్తికాలేదన్నారు. పనులకు రోడ్డు తవ్వి అసంపూర్తిగా వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడి అమరేందర్, మద్రి మల్లారెడ్డి, కందుల కృష్ణార్జున్‌రావు, ఈదర సత్యనారాయణ, కంచుగట్ల వీరభద్రం, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, అశోక్‌కుమార్, సున్నం రాంబాబు, బొర్రా శ్రీను, చుంచు రామ్మూర్తి, నజీర్‌షోను, రాజేష్, డాక్టర్‌బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎల్ఎఫ్ అలవెన్స్ జీవోపై హర్షం

మణుగూరు రూరల్: భద్రాద్రి థర్మల్ పవర్‌స్టేషన్-మణుగూరు, పాల్వంచ కేటీపీఎస్ ఏడో దశ ఉద్యోగులకు జెన్‌కో యాజమాన్యం ఐదు శాతం పీఎల్ఎఫ్ అలవెన్సులు మంజూరు జారీపై తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌పీఈయూ)-1535 రాష్ట్ర అధ్యక్షులు ఎంఏ.వజీర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ... ప్రతీ నెలా 85 శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టరీ ఉన్న కర్మాగారాల ఉద్యోగులకు ఏప్రిల్ నుంచి ఈ అలవెన్సు వర్తిస్తుందన్నారు. అలవెన్సులకు సంబంధించిన ఏరియర్స్‌ను కూడా ఉద్యోగులకు చెల్లించడం జరుగుతుందన్నారు. పీఎల్ఎఫ్ అలవెన్స్‌ను మంజూరు చేసిన జెన్‌కో సీఎండి హరీష్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రీజనల్ అధ్యక్షులు వి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్.రామచందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, సిద్దుల హుస్సేన్, జార్జ్, కోశాధికారి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్లు ఎస్‌డి.రఫీ, రాజా మనోహర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు ఆమోదం

చండ్రుగొండ: మండలకేంద్రంలో శనివారం ఏర్పాటుచేసిన పెసా గ్రామసభలో రెండు మద్యం షాపుల నిర్వహణకు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఏపీఓ ఖాన్, పంచాయితీ సెక్రటరీ రాజేందర్ వివిధ రాజకీయ పక్షాల నాయకుల పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం


నివాళులర్పిస్తున్న నాయకులు

దుమ్ముగూడెం: స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం సత్తా చాటుతుందని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతామని డీసీసీబీ మాజీ చైర్మన్ యలమంచి రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని భీమవరం గ్రామంలో అధ్యక్షతన నిర్వహించి పార్టీ నాయకుడు సోయం వీరస్వామి వర్ధంతి సందర్భంగా ఆయన స్మారకస్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, సోయం జోగారావు, సోయం నాగమణి, కూరం వీరభద్ర , అర్జున్, రంగయ్య, సాయి కిరణ్, సున్నం వెంకట్ రమణ తదితరులు పాల్గొన్నారు.

దోమలమందు పిచికారీ

మణుగూరు రూరల్: మండల పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన పెద్దిపల్లిలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం దోమల మందు పిచికారీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఇంటింటికి మందు పిచికారీ చేసినట్లు సబ్ యూనిట్ అధికారి వీరస్వామి తెలిపారు. అనంతరం గ్రామాల్లో నీటి నిల్వ కుంటల్లో యాంటీ లార్వా ద్రావణాన్ని చల్లారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, శైలజ, వెంకటమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిపై ప్రచారం చేయాలి

- ఎమ్మెల్యే ఆదినారాయణ

దమ్మపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి చేరేలా సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శనివారం మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ఉన్నతికి సోషల్ మీడియాను ఒక సాధనంగా ఉపయోగించాలన్నారు. గ్రామస్థాయిలోని ప్రజలకు దగ్గరగా ఉండేలా సోషల్ మీడియా ఇన్‌చార్జిలు బాధ్యతయుతంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్‌చార్జిలు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు భూమిపూజ


అశ్వారావుపేట: పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

అశ్వారావుపేట: మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారి విస్తరణకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం భూమి పూజ నిర్వహించారు. గతంలో రూ.10 కోట్లు మంజూరైనా పనులు నిలిచిపోవడంతో మరో రూ.9 కోట్లు నిధులను మంజూరు చేయించామని, మరో రూ.కోటితో డివైడర్ కొనసాగింపు పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఆర్అండ్‌బీ డీఈఈ ప్రకాశ్, నాయకులు జూపల్లి రమేష్ బాబు, తుమ్మ రాంబాబు తదితరులు ఉన్నారు.

రేపు నియోజకవర్గ స్థాయి సమావేశం


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

మణుగూరు రూరల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఈ నెల 4న బీఆర్ఎస్ పినపాక నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గుట్టమల్లారంలోని హనుమాన్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే సమావేశాన్ని నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు అడపా అప్పారావు, ఆవుల నర్సింహారావు, ముద్దంగుల కృష్ణ, తడికమల్ల ప్రభుదాస్, ఎడవల్లి వెంకటయ్య, రామారావు, వెంకట్, శంకర్, రవిప్రసాద్, గుర్రం సృజన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

భద్రాచలంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను గాలికొదిలేసి వారి భవిష్యత్‌ను అంధకారంలోకి నెడుతుందని, భావితరాల భవిష్యత్‌కు వెంటనే విద్యరంగ సమస్యలను పరిష్కరించాలని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి దాసరి రాజశేఖర్, జిల్లా అధ్యక్షులు సిలుముల అజయ్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తక్షణమే పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్ విడుదల చేయాలని, హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని, గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలన్నారు. అనంతరం భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు, మండల కమిటీలను ఎన్నుకున్నారు.

బాలవెలుగులో పుట్టినరోజు వేడుకలు

మణుగూరు టౌన్: టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి జన్మదిన వేడుకలుముత్యాలమ్మ నగర్‌లోని బాలవెలుగు అనాథ పిల్లల పాఠశాలలో ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించి చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావు, మస్తాన్, ముకేశ్‌కుమార్, దాసుమల్ల ప్రవీణ్‌కుమార్, గుగులోత్ రమేశ్ నాయక్, వినయ్‌కుమార్, నరేశ్, సురేశ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం


మాట్లాడుతున్న సరోజ

మణుగూరు టౌన్: మున్సిపాలిటీలోని ప్రధాన రహదారిలో సెంట్రల్ లైటింగ్ వెలగక ప్రజలు రాత్రివేళ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, డ్రెయినేజీ సమస్యల పరిష్కారంలో మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ ఆరోపించారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... సెంట్రల్ లైటింగ్ వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పలుమార్లు మున్సిపాలిటీ కమిషనర్‌కి విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో షభానా, కోరి శ్యామల, బొడ్డు సౌజన్య, రెడ్డిబోయిన రేణుక, నాంపల్లి రమణ, కన్నాపురం శైలజ తదితరులు పాల్గొన్నారు.